క్లుప్తంగా

దేవాలయాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



దావులూరు(కొల్లిపర): దేవాలయాలు పరిశుభ్రంగా ఉంచుకునే విషయంలో ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని. ఆలయాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆ గ్రామ సంస్కారం వెలువడుతుందని జిల్లా భారతీయ జనతా పార్టీ సోషల్ మీడియా కో కన్వీనర్ అరిమండ మణిదీప్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర బారతీయ జనతా పార్టీ ఆదేశాల మేరకు శనివారం మండలంలోని దావులూరు గ్రామంలోని వేణుగోపాల స్వామి దేవాలయంలో స్వచ్ఛ బారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో చెత్తను తొలిగించి, మెరక పల్లాలను సరిచేసి, ఆలయంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జనతా పార్టీ మండల అధ్యక్షుడు మంద్రు మురళీధర్, మండల ప్రధాన కార్యదర్శి అశ్విని కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు మునగాల కృష్ణమూర్తి, లోకేష్ రెడ్డి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ ఆక్రమించి మున్సిపాలిటీ నిర్మాణాలా?

తెనాలి: పట్టణ బుర్రిపాలెంరోడ్డులోని రైతుబజారు ఎదుట నిర్మిస్తున్న మున్సిపల్ దుకాణాలను వెంటనే తొలగించాలని ది తెనాలి పట్టణ, పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం డిమాండ్ చేసింది. సంఘ బాధ్యులు శనివారం ఆ ప్రాంతాన్ని సందర్శించారు. మున్సిపల్ డ్రెయినేజీ కాల్వను ఆక్రమించి మున్సిపాలిటీ పది దుకాణాలను నిర్మిస్తోందని తెలిపారు. మురుగునీరు సాఫీగా ప్రవహించేలా చూడాల్సిన బాధ్యత కలిగిన మున్సిపాలిటీనే స్వయంగా మురుగు కాల్వపై దుకాణాలు నిర్మించటం ఏమిటని ప్రశ్నించారు. ఇది పూర్తిగా చట్టవిరుద్ధమైన చర్యగా విమర్శించారు. ప్రజలందరూ వ్యతిరేకించినా, మున్సిపాలిటీ దుకాణాల నిర్మాణానికి పూనుకోవటం విస్మయం కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు దరిశి శివకోటేశ్వరరావు, సభ్యులు అబ్దుల్ ఆరిఫ్, రావూరి శివశంకరరావు, నారాయణం కమల్ కుమార్, రాజేష్, లక్కరాజు చిరంజీవి, సోమయ్యశాస్త్రి, మురళి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణలో చొరవ చూపాలి

సీడీపీవో విజయ గౌరి



తెనాలిటౌన్: బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రజలు చొరవ చూపాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు తెనాలి సీడీపీవో పి.విజయగౌరి సూచించారు. స్థానిక చంద్రబాబునాయుడు కాలనీలో శనివారం అంగన్‌వాడీ కేంద్రంలోని పోషణ్ మహా కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీవో విజయ గౌరి పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. రైల్వే చైల్డ్ హెల్ప్ లైన్ గుంటూరు బృంద సభ్యుడు లక్ష్మణ్ నందన్ మాట్లాడుతూ నేటి సమాజంలో బాలల హక్కుల ఉల్లంఘన జరుగుతుందని, బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత, వారి రక్షణ ప్రతి ఒక్కరిపై ఉందని వివరించారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలన, బాలల హక్కులపై పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో 23వ వార్డు కౌన్సిలర్ శిరీష, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వీరమాచినేని సరోజిని సాంస్కృతిక సేవ నిరుపమానం



తెనాలి: ఆంధ్రప్రదేశ్ లో ప్రజానాట్యమండలి కమ్యూనిస్టు పార్టీ సాంస్కృతిక కళారంగాన్ని ప్రజల్లో బహుళ ప్రచారం చేసిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుగ్రహీత వీరమాచనేని సరోజిని ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచారని 'ఇస్కఫ్' రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శ్రీదేవి అన్నారు. స్థానిక గాంధీనగర్‌ని ఇస్కఫ్ హాలులో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, తెనాలి శాఖ నిర్వహిస్తున్న అమర కళాకారుల సంస్మరణలో భాగంగా శనివారం వీరమాచినేని సరోజిని, తాపీ రాజమ్మ, సావిత్రి సంస్మరణ సభకు పి.శ్రీదేవి అధ్యక్షత వహించారు. శ్రీదేవి తన ప్రసంగంలో సరోజిని చేసిన సాంస్కృతిక కృషిని సోదాహరణంగా వివరించారు. ఇస్కఫ్ నాయకురాలు బెజ్జంకి నాగమణి సభా పరిచయం చేశారు. కార్యక్రమంలో సీహెచ్.అనూరాధ పి.సునీత,ఏ. బేబీ రాణి, కె. వెంకటేశ్వరమ్మ, బొల్లిముంత కృష్ణ, బాలస్వామి, మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం హరిస్తున్న చిరుతిండ్లు

- గాలిలో దీపంలా ప్రజారోగ్యం
- కనీస జాగ్రత్తలు తీసుకోని వ్యాపారులు
- నిమ్మకు నీరెత్తిన అధికారులు
- హానికరమని తెలిసినా కొనేస్తున్న జనం



బేకరీ ఎదుట తినుబండారాల కొలువు



రోడ్డువెంట బజ్జీలు, పునుగుల దుకాణం

తెనాలి: ఆంధ్రాప్యారిస్ తెనాలి... పేరుకే ప్యారిస్‌తో పోలిక. పోటీపడేందుకు ఏమాత్రం ఇక్కడ ఏమీ కనిపించవు. ఒకప్పుడు చైతన్యానికి మారుపేరుగా నిలిచిన పట్టణంలో ఇప్పుడు, ప్రజల ఆరోగ్యం ఎవరికీ పట్టటం లేదు. గాలికి వదిలేశారు. సమస్త చిరుతిండ్లు రోడ్లపైనే నడుస్తున్నాయి. నిత్యం వాహనాలతో రేగే దుమ్మూధూళి నుంచి కనీస ఆచ్ఛాదన ఉండటం లేదు. అధికారులు అటుకేసి చూడటం లేదు. చివరకు ప్రజలకు కూడా రోడ్లపై విక్రయించే చిరుతిండ్లతో రోగాలను కొనితెచ్చుకుంటున్నారు. ప్రస్తుతం వివిధ పట్టణాల్లో డయేరియా లక్షణాలతో జనం ఆసుపత్రి పాలవుతున్న నేపథ్యంలోనూ తెనాలిలో ఈ పరిస్థితి కొనసాగుతూనే ఉంది.

ఏ రోడ్డు చూసినా ఏమున్నది గర్వకారణం... అన్నట్టు పట్టణంలోని ప్రతి ప్రధాన వీధిలోనూ ఆహార పదార్థాలు విక్రయించే టిఫిన్ బండ్లు, స్వీట్లు అమ్మే దుకాణాలు కనిపిస్తుంటాయి. రకరకాల స్వీట్లతో పాటు బజ్జీలు, పునుగులు, మిఠాయి, పకోడీ, బూంది, చెగోడీలను విక్రయిస్తుంటారు. నూనెతో చేసిన పదార్థాలను ఆకర్షణీయంగా కనిపిస్తూ రోడ్డంట వెళ్లేవారికి జిహ్వాచాపల్యంతో నూరూ రిస్తుంటాయి. రోడ్డుపక్కన వ్యాపారాలకు ఎవరూ అభ్యంతరం పెట్టరు. తినుబండారాలను దుమ్మూధూళి పడేలా ఉంచటం కచ్చితంగా వినియోగదారుల ఆరోగ్యానికి మంచిది కాదు. తెనాలి పట్టణంలోని ఇరుకురోడ్లలో తిరిగే వాహనాల్లోంచి వచ్చే పొగ, టైర్ల నుంచి లేచే దుమ్ము ఎక్కువ. నూనెతో చేసిన ఆహార పదార్థాలకు దుమ్ము తేలికగా అతుక్కుపోతుంది. వాటిని తింటే అనారోగ్యం రాక మరేమొస్తుంది? దీనికితోడు కొందరు మరిగించిన నూనెను పదేపదే పదార్థాల తయారీకి వాడుతున్నారు. ఇది హానికరమని తెలిసినా ఎవరూ ఖాతరు చేయటం లేదు. ఒకచోట నూనె బాండిలో మరికొంత నూనెను పోసేందుకని, కట్ చేయడానికి బద్ధకమేసి సలసల కాగుతున్న నూనెలో నూనె ప్యాకెట్లను తాకిస్తున్నారు. నూనె వేడికి ప్లాస్టిక్ కవరు కరిగిపోయి నూనె బాండీలో పడుతోంది. అక్కడ నిత్యం ఇదే పనిచేస్తోంది ఆ యజమాని. తినుబండారాలను తయారుచేయగా మిగిలిన నూనెను కొందరు అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి, టిఫిన్ బండ్లపై దోసెలు వేసి తక్కువ ధరకు అమ్ముతున్నారనే ఆరోపణలున్నాయి.

క్యాన్సర్ విజృంభిస్తున్న నేటిరోజుల్లో హానికరమైన తినుబండారాలకు దూరంగా ఉండాలనే భావన జనంలో ఉండటం లేదు. రోడ్లవెంట దుమ్మూధూళి పడేచోటనే కొనుగోలు చేసి తింటున్నారు. స్వీట్లూ వంటివి తక్కువ ధరకు వస్తున్నాయనగానే కొనేసి, బంధుమిత్రులకు కానుకగా ఇస్తున్నారు. తినుబండారాలపై తగిన రక్షణ ఏర్పాట్లు ఉండేలా చూడాల్సిన అధికారులు అటుకేసి చూడటం లేదు. మున్సిపాలిటీ అధికారులకు ఎవరైనా పనిగట్టుకుని ఫిర్యాదు చేస్తే మినహా, పట్టించుకోవటం లేదు.

గతంలో మున్సిపాలిటీలో ఉండే ఫుడ్ ఇన్‌స్పెక్టర్ చాలాకాలంగా కనిపించటం లేదు. పోస్టుల భర్తీ లేక పోవటంతో ఆ పోస్టులూ అదృశ్యమవుతూ వచ్చాయి. ఇక తనిఖీలకు ఆస్కారం ఎక్కడ? ఏదిఏమైనా కలుషిత ఆహార పదార్థాలపై పట్టణవాసులు ఓ కన్నేసి ఉంచాల్సిన అవసరం ఉంది.

మీ పనితీరులో మార్పురాదా?

- వ్యర్థాల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి మనోహర్
- శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను సరెండర్ చేయాలని ఆదేశం



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి మనోహర్

తెనాలిఅర్బన్: చినరావూరులో ఎక్కడ చూసిన వ్యర్థాల గుట్టలు, పారుదల లేని కాల్వల్లో కనిపిస్తున్నాయి. నేను ఈ ప్రాంతంలో పర్యటిస్తానని ముందుగా మీకు సమాచారం ఇచ్చిన ఎందుకు మీరు బాధ్యతరహిత్యంగా వ్యవహరిస్తున్నారు? మీ పనితీరులో మార్పు రాకపోతే చర్యలు తప్పవంటూ రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చినరావూరులో శనివారం ఆయన పర్యటించారు. కమ్యూనిటీ హాల్ వద్ద రోడ్లపై చెట్ల కొమ్మలు ఎక్కువగా ఉండటాన్ని గమనించిన ఆయన అసహనం వ్యక్తం చేశారు. కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోయి కనిపించడంతో సిబ్బందిని పిలిపించి వాటిని బాగు చేయించారు. గతంలో వార్డు పర్యటన చేసినప్పుడు కూడా ఇదే పరిస్థితి కనిపించిందని, ఎందుకు ఇక్కడ మార్పు రావడం లేదంటూ ఇన్‌చార్జి కమిషనర్ పి.శ్రీకాంత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనుపమలను ప్రశ్నించారు. ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరిస్తున్న మీరు ప్రతి రోజు వార్డులలో పర్యటించాలని ఆదేశించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనుపమను సరెండర్ చేయాలని సబ్‌కలెక్టర్ సంజన సింహకు సూచించారు. అనంతరం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు, నగర దీపికలు కార్మికులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి నాల్గవ శానిటేషన్‌ను డివిజన్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోనున్నట్లు ప్రకటించారు. నెల రోజుల్లో డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో చెత్త సమస్య, కాల్వల పూడికతీత పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సబ్‌కలెక్టర్ సంజన సింహా నేతృత్వంలో ఒక వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేసి ప్రతిరోజు డివిజన్‌లో జరిగే పారిశుధ్య నిర్వహణ పనుల ఫోటోలను దానిలో అప్‌లోడ్ చేయాలని సూచించారు. నెలరోజుల్లో పూర్తిగా డివిజన్‌లో మార్పు రావాలని అందుకు అధికారులు, కౌన్సిలర్లు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కౌన్సిలర్లు కుర్రా సుజాత, దాసరి వసంతరావు, గోగిరెడ్డి మానస రెడ్డి, నందివెలుగు సర్పంచ్ పవన్, ఎంపీటీసీ హరికృష్ణ, మార్కెట్ యార్డు చైర్మన్ తోట దుర్గ, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు జాకీర్, రఘు రామయ్య, జనసేన నాయకులు గౌరీశంకర్, సుబ్రమణ్యం, సాయి, బసవయ్య, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తులపై కేసు

తెనాలిరూరల్: ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తులపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బుర్రిపాలెం గ్రామంలో కొందరు డ్రెయినేజీలో మట్టి వేసి మురుగు పారుదల జరుగకుండా ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తునాన్నరని పంచాయతీ అధికారులకు ఫిర్యాదులు వచ్చాయి. పంచాయతి కార్యదర్శి ఎ. ఇంద్రజ ఆ ప్రాంతాన్ని పరిశీలించి మట్టిన సిబ్బందితో తొలగిస్తుండగా ఆమె, సిబ్బంది విధులకు దాసరి మోహనరావు, మరికొందరు ఆటంకం కలిగించారు. దీనిపై కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ కె. ఆనంద్ శనివారం తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



తెనాలిరూరల్: పట్టణ నాజరుపేట బిక్షావతి బజారులో శనివారం సాయంత్రం సుమారు 50 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న వన్ టౌన్ ఎస్ఐ కోటేశ్వరమ్మ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వద్ద ఎటువంటి వివరాలు లభ్యం కాకపోవడంతో, హెల్పింగ్ సోల్జర్స్ బృందం సహాయంతో మృతదేహాన్ని వైద్యశాల మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంచాయతీలకు సొంత ఆదాయం ముఖ్యం



చుండూరు(వేమూరు): గ్రామ పంచాయతీలు సొంత ఆదాయం కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఎంపీపీ జాలాది రూబేను తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సొంత ఆదాయంపై పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచ్‌లతో సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజులు ఈ సమావేశాలు ఉంటాయని పేర్కొన్నారు. మేజరు పంచాయతీలకు సొంత ఆదాయ వనరులు పూర్తి స్థాయిలో ఉంటాయని, వాటిని గ్రామ పంచాయతీ గుర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుపదీ, డిప్యూటీ ఎంపీడీవో ఉషారాణి, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ చిరునామా అనిశెట్టి రజిత

సంస్మరణ సభలో డాక్టర్ చల్లపల్లి స్వరూపరాణి



సంచికను ఆవిష్కరించిన రచయితలు

తెనాలి: తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకభూమిక పోషించిన అనిశెట్టి రజిత స్త్రీవిముక్తికి, సామాజిక సమానత్వానికి, సామాజిక న్యాయం కోసం జీవితకాలం కృషిచేశారని ప్రముఖ రచయిత్రి డాక్టర్ చల్లపల్లి స్వరూపరాణి అన్నారు. పట్టణానికి చెందిన సాహితీ సంస్థ భిన్నస్వరాలు ఆధ్వర్యంలో శనివారం రాత్రి కవిరాజ పార్కులోని వీజీకే భవన్లో సామాజిక ఉద్యమకారిణి అనిశెట్టి రజిత సంస్మరణకు జుగాష్‌విలి అధ్యక్షత వహించారు. స్వరూపరాణి మాట్లాడుతూ ఏ ఉద్యమ సంస్థలోనూ సభ్యత్వం లేకున్నా, అన్ని అభ్యుదయ ఉద్యమాల్లోనూ భాగస్వామి అయ్యారని తెలిపారు.

గొప్ప ప్రజాస్వామికవాది అయిన రజిత, 1973లో రచనా జీవితం ఆరంభించి ఏడు కవితా సంపుటాలు, కథాసంపుటి, వందలాది వ్యాసాలు, హైకూలు, నానీలు రచించారని వివరించారు. ఆమె కృషికి దక్కాల్సినంత సాహిత్య గౌరవం దక్కలేదని స్వరూప రాణి అభిప్రాయపడ్డారు. రజితను స్మరించుకోవటమంటే అభ్యుదయ ఉద్యమాల్లోని స్ఫూర్తిని ఆవాహన చేసుకోవటమేనని అన్నారు. 'విరసం' రాష్ట్ర అధ్యక్షుడు అరసవెల్లి కృష్ణ తన ప్రసంగంలో ప్రముఖ సాహితీవేత్తలతో సహవాసం రజిత చైతన్యాన్ని నిత్యం ప్రజ్వరిల్లచేసిందనీ, క్రమంగా తానే స్ఫూర్తినిచ్చి కదిలించేదిగా ఎదిగారని చెప్పారు. ఆమె జీతాన్ని, జీవితాన్ని సమాజంకోసం అంకితం చేశారనీ, చివరకు మరణించాక కూడా ఆమె పార్థివదేహాన్ని వైద్యకళాశాలకు దానం చేశారని గుర్తుచేశారు. జనసాహితి కొత్తపల్లి రవిబాబు మాట్లాడుతూ రజిత ధిక్కార ధోరణితో ఆమెను 'వరంగల్లు రుద్రమ'గా అంటారని గుర్తుచేసుకున్నారు. ప్రముఖ రచయిత్రి భండారు విజయ మాట్లాడుతూ బంగారు తెలంగాణ స్వపరిపాలనలో మన నీరు, మన నిధులు, మన కొలువులు అన్న నినాదం భ్రమగానే మిగిలినపుడు, తిరిగి తన గొంతును సవరించి ప్రభుత్వ పాలకులకు, వారి నిర్మాణాలకు వ్యతిరేకంగా నిరసన గళాన్ని వినిపించిన ధీరశాలి అనిశెట్టి రజిత అన్నారు. రజితతో తన స్నేహాన్ని గూడూరు సీతామహాలక్ష్మి స్మరించుకున్నారు.

అరసం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నిధి (బ్రహ్మచారి) మాట్లాడుతూ భారతీయ సమాజంలో పెద్ద సమూహమైన పీడిత జనపక్షపాతి అజిత అన్నారు. తొలుత 'భూమిక' ప్రచురించిన రజిత సంస్మరణ సంచికను ఆవిష్కరించారు. సభకు జీఎస్ నాగేశ్వరరావు స్వాగతం పలికారు.

తెలుగు సినిమాలో 'అక్కినేని'ది ప్రత్యేకస్థానం

102వ జయంతి రోజున 'స్వరలయ' నివాళి



అక్కినేని చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అభిమానులు

తెనాలి: ఏడు దశాబ్దాలకుపైగా తెలుగు చలనచిత్రసీమలో తనకంటూ ప్రత్యేకస్థానాన్ని సొంతం చేసుకున్న నటసామ్రాట్ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్మరణీయులని స్వరలయ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు సాయి లక్కరాజు అన్నారు. ప్రముఖ సినీనటుడు అక్కినేని నాగేశ్వరరావు 102వ జయంతిని శనివారం పట్టణానికి చెందిన సంగీత సాంస్కృతిక సంస్థ స్వరలయ ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయి లక్కరాజు అధ్యక్షత వహించారు. 1946లో అక్కినేని కథానాయకునిగా నటించిన బాలరాజు చిత్రం తెలుగులో ఒక గొప్ప సినిమాగా గుర్తుచేశారు. 1955 తెలుగులో తొలి సాంఘిక చిత్రం 'సంసారం' అని చెబుతూ తర్వాత వచ్చిన దసరా బుల్లోడు చిత్రంతో పాటల్లో నృత్యాలతో నూతన ఒరవడిని ప్రవేశపెట్టారనీ, ఆతర్వాత నుంచే కథానాయకులకు స్టెప్పులు తప్పనిసరి అయ్యాయని చెప్పారు. అక్కినేని వీరాభిమాని శ్రీనివాసరావు ప్రసంగిస్తూ దాదాపు అయిదు దశాబ్దాలు అక్కినేని జన్మదినానికి మిత్రులతో కలిసి తెనాలి నుండి ఆయన ఎక్కడున్నా, వారి వద్దకు వెళ్లి శుభాకాంక్షలు తెలిపేవాడినని గుర్తుచేసుకున్నారు. జీవిత బీమా ఉద్యోగుల సంఘం నాయకుడు వేదాంతం ఫణీంద్ర, స్వరలయ సభ్యులు తిరుమలరావు అక్కినేని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. మల్లేశ్వరరావు అక్కినేని చిత్రంలోని 'జో లాలి' పాటను ఆలపించారు. కె.వెంకయ్య, మూర్తి, ఉమామహేశ్వరరావు, రమణయ్య పాల్గొన్నారు.

'మాండూక్యోపనిషత్' గ్రంథానికి పల్లకీ ఉత్సవం



బుర్రిపాలెంలో పల్లకీ ఊరేగింపు

బుర్రిపాలెం(తెనాలి): మానవుడి పుట్టుక మూలంతో సహా సనాతన సంప్రదాయపు విశిష్టతను తెలియజేసే ఆధ్యాత్మిక గ్రంథం 'మాండూక్యోపనిషత్'కు రూరల్ మండల గ్రామం బుర్రిపాలెంలో పల్లకీలో ఊరేగించి పట్టాభిషేకం చేశారు. గ్రామస్తుల సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో 'ట్రూత్ వివేకామృతం' అధ్యాత్మిక సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఆధ్యాత్మిక గురువు వివేకానంద వివిధ వేదాలు, ఉపనిషత్‌ల సారాన్ని గ్రహించి మండూక్యోపనిషత్ అనే గ్రంథాన్ని రచించారు. ఇది జ్ఞానాన్ని తెలియజేసే గ్రంథరాజంగా భావించి ప్రతిఒక్కరికీ చేరాలన్న ఉద్దేశంతో తొలిగా బుర్రిపాలెంలో పల్లకీ మహోత్సవం చేశారు. గ్రామానికి చెందిన శాఖమూరి వెంకటేశ్వరరావు–హేమలత కుమారుడు గోపీకృష్ణ-సాగరిక దంపతలు సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని పండగలా చేశారు. అందంగా అలంకరించిన పల్లకీలో మాండూక్యోపనిషత్ గ్రంథాన్ని ఉంచి గ్రామంలోని వీధుల్లో ఊరేగింపు జరిపారు. మానవుడిని మాధవుడిని చేసే ఈ గ్రంథరాజాన్ని మానవాళికి ప్రసాదించినందుకు మహర్షులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, మార్గమధ్యంలో ప్రతి దేవాలయంలోనూ పట్టువస్త్రాలు, గ్రంథంతో కూడిన సారెను సమర్పించారు. చివరగా మేళతాళాలతో ప్రతి ఇంటికీ వెళ్లి గ్రంథాన్ని అందజేశారు. విగ్రహాన్ని పవిత్రంగా దైవంగా భావిస్తామని, ఆ దైవమిచ్చిన జ్ఞానాన్ని విగ్రహంగా మలచి, పల్లకీఉత్సవం చేస్తున్నట్టు ట్రూత్ వివేకామృతం సంస్థ ప్రతినిధులు తెలియజేశారు. భూతలంలో ఒక ఆధ్యాత్మిక గ్రంథానికి ఇలా పల్లకీఉత్సవం జరపటం ఇదే తొలిసారిగా చెబుతూ, దివ్యమైన గ్రంథాన్ని అందరికీ అందివ్వాలనే ఉద్దేశంతో వేడుక జరిపామని, సహకరించిన బుర్రిపాలెం గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్రలో భాగస్వాములు కావాలి

మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపు



జిల్లా వైద్యశాలలో ఊడుస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, సిబ్బంది



చినరావూరులో మొక్కలు నాటుతున్న మంత్రి మనోహర్, సబ్‌కలెక్టర్ సంజన సింహా

తెనాలిఅర్బన్: స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని చినరావూరులో శనివారం నిర్వహించారు. చినరావూరు రైల్వేస్టేషన్ వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతోప్రతిష్ఠాత్మకంగా ప్రతి నెల 3వ శనివారం స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. తెనాలి పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రణాళికబద్ధంగా అధికారుల, ప్రజాప్రతినిధులు పనిచేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. కాల్వల్లో ఎవరు వ్యర్థాలను వేయ వద్దని సూచించారు. అలాగే పట్టణంలోని ఖాళీ స్థలాలను బాగు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. యాజమానులు తమ స్థలంలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని లేని పక్షంలో మున్సిపాలిటీ దానిని బాగు చేయించి రూ. 3 వేలు అపరాధ రుసుము విధించడం జరుగుతుందని హెచ్చరించారు. అప్పటికి స్పందించకపోతే ఆ స్థలాల్లో బోర్డులను ఏర్పాటు చేసి దానిని ప్రజల అవసరాలకు వినియోగించనున్నట్లు తెలిపారు. సబ్ కలెక్టర్ సంజన సింహా, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, ఇన్‌ఛార్జి కమిషనర్ పి.శ్రీకాంత్, తహశీల్దార్ గోపాలకృష్ణ, డీఎస్పీ జనార్ధనరావు, కౌన్సిలర్లు కుర్రా సుజాత, దాసరి వీరవసంతరావు, గోగిరెడ్డి మానసరెడ్డి, హౌసింగ్ ఈఈ భాస్కరరావు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా తెనాలి ఆర్టీసీ డిపో ఆవరణను శుభ్రం చేశారు. దానిలో పిచ్చిమొక్కలు తొలగించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అనంతరం సిబ్బందితో డీఎం రాజశేఖర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.
- స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని జిల్లా వైద్యశాలలో నిర్వహించారు. ఆవరణను ఊడ్చి శుభ్రం చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సూపరిండెంటెంట్ డాక్టర్ టి.సౌభాగ్యవాణి మాట్లాడుతూ పర్యావరణ పరిక్షణకు మొక్కలు దోహదపడతాయన్నారు. ప్రతి రోజు చెట్లు నాటాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ నరేంద్ర సింగ్, డాక్టర్ రామాంజనేయులు, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక చట్టాలు రద్దు చేయాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్



సీఐటీయూ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

కొల్లూరు: కార్మికుల హక్కులను హరించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్ ఉన్నాయని, ఆ నాలుగింటిని తక్షణం రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ అన్నారు. శనివారం కొల్లూరు ప్రజాసంఘాల భవనంలో గ్రామ పంచాయతీ గ్రీన్ అంబాసిడర్‌ల మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉద్యోగుల పని గంటలను పెంచుతూ తీసుకున్న నిర్ణయం సరైనది కాదని విమర్శించారు. గ్రీన్ అంబాసిడర్లకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జీవో 551 ప్రకారం పారిశుద్ధ్య కార్మికుల విషయంపై ఇబ్బంది ఎందుకని ప్రశ్నించారు. ఈ నెల 27న రేపల్లెలో నిర్వహించనున్న సీఐటీయూ జిల్లా మహాసభలకు కార్మికులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో గౌరవ అధ్యక్షుడిగా బొనిగల సుబ్బారావు, అధ్యక్ష, కార్యదర్శులుగా చొప్పర సురేష్, కంచర్ల సుబ్బారావు, చొప్పర శ్రీనివాసరావులతో కూడిన 17 మందితో నూతన కమిటీ ఎన్నికైంది. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బొనిగల అగస్టీన్, బొనిగల సుబ్బారావు, పి. జ్యోతి, చొప్పర చెంచయ్య పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



మొక్కలునాటుతున్న ఎంపీడీవో అత్తోట దీప్తి

తెనాలిటౌన్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి అత్తోట దీప్తి పిలుపునిచ్చారు. రూరల్ మండలం హాఫ్‌పేట గ్రామంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తామని, తడి చెత్త-పొడి చెత్తను వేరువేరుగా పారిశుద్ధ్య సిబ్బందికి ఇవ్వాలని, రోడ్లపై చెత్తచెదారం వేయ వద్దని, మొక్కలు నాటి సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీవో అత్తోట దీప్తి మాట్లాడుతూ ప్రతి నెల 3వ శనివారం మండలంలోని 18 గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాల్వల పూడికతీత, రోడ్ల పరిశుభ్రత, చెత్త చెదారం తొలగింపు, అవగాహన ర్యాలీలు, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వి.నాగిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా దసరా సంబరాలు



తెనాలి: స్థానిక సుల్తానాబాద్‌లోని భాష్యం ఇంగ్లిష్ మీడియం హైస్కూలులో శనివారం దసరా సంబరాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మణికాంత్ దత్తు, హెచ్.ఎమ్ జిగర్, వైస్ ప్రిన్సిపాల్ నాగరాజు హాజరై విద్యార్థులను అభినందించారు. సబ్‌జోనల్ ఇన్‌చార్జ్ రాము, కృష్ణ–3 జోన్ జెడ్‌ఈఓ శివ, విద్యార్థుల ప్రతిభను అభినందించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో దసరా పండుగ ఆత్మీయతను ప్రతిబింబించారు.